

వివరాలు మెయిన్‌లో

**ఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులను జూలై 31 లోగా పూర్తి చేయండి**

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 12 జూన్ , 2026 | పేజీలు : 05

# సాగుకు సన్నద్ధం...

### పంట ప్రణాళికను సిద్ధం చేసిన అధికారులు

### సూర్యాపేట జిల్లాలో 6.20.084 లక్షల ఎకరాలలో సాగు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : కొత్త కొన్ని ఏండ్లుగా జిల్లాలో మెట్ట సాగుకన్నా వరి అధికంగా సాగు అవుతుంది. గతంలో నీటివనరుల కొరత తీవ్రంగా ఉండడంతో మెట్ట పంటల సాగుకే పరిమితమైన రైతులు వరిపంట సాగు బోరుబావులపై ఆధార పడి చేసేవారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కృష్ణ జలాలతోపాటు ఒకపక్క గోదావరి, మరోపక్క మూసీ జలాలు సమృద్ధిగా పెరగడం, చెరువులు, కుంటలను నింపడంతో నిండుగా నీరు చేరి మత్తడి తొక్కడంతో బీడుబారిన భూములను రైతులు చదును చేసి పంటసాగు చేయడంతో పచ్చటి పైరుతో సస్యశ్యామలంగా మారాయి. మెట్ట పంటల సాగు అధికంగా చేసే రైతులు వరి సాగును ప్రధానం పంటగా ఎంచుకున్నారు. దీని తరువాత స్థానంలో పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ వానాకాలం సీజన్‌లో 4,94,5000 ఎకరాల్లో వరి పంట సాగు కానుందని అంచనా వేయగా పత్తి 90,800, మొక్కజొన్న 5,500, మిర్చి 4,500, ఫామాయిల్ 4,500, కంది 1,650, పెసర 1,395, వేరుశనగ 350, చెరుకు 44, ఇతర పంటలు 1,820, పండ్లు, కూరగాయలు 15, 025 ఎకరాల్లో సాగు కానున్నట్లు వెల్లడించారు.

**రైతులకు అందుబాటులో విత్తనాలు... ఎరువులు...**

వానాకాలం సీజన్‌లో పంట సాగుకు అవసరమైన విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులోకి తెచ్చారు. 98,900 క్వింటాళ్లు వరి విత్తనాలు, 2,27,000 ప్యాకెట్ల పత్తి విత్తనాలు (475 గ్రాములు ఒక ప్యాకెట్), 550 క్వింటాళ్ల జొన్న విత్తనాలు, 132 క్వింటాళ్ల కంది, 105 క్వింటాళ్ల వేరుశెనగ, 90 క్వింటాళ్ల పెసర విత్తనాలు అందుబాటులోకి తెచ్చారు.




**ఎరువులు...** జిల్లాలో వివిధ పంట సాగులకు మొత్తం 1,18,612 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం ఉండగా 40,207 మెట్రిక్ టన్నులను రైతులకు అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు తెలిపారు. యూరియా 56,270 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 16,443 మెట్రిక్ టన్నులు నిల్వ ఉండగా, డిఏపి 12,260 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 2,843, ఎం.ఓ.పి. 5,560 అవసరం ఉండగా 925, కాంప్లెక్స్ ఎరువులు 42,247 అవసరం ఉండగా 18,961, ఎస్.ఎస్.పి 2,275 అవసరం ఉండగా 1,035 నిల్వ ఉన్నట్లు ప్రకటించారు.

**ఎల్‌నినో ప్రభావం ఉంటే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి...**

వాతావరణ శాఖ నిపుణులు ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ముందే హెచ్చరించడంతో జిల్లా వ్యవసాయ అధికారులు ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేసుకోవాలని సూచించారు. దీనికి అనుగుణంగా జూలై 30 వరకు వర్షాలు అంతంత మాత్రమే ఉంటే జొన్న, కంది, మినుములు, నువ్వులు సాగు చేయాలని ఆగష్టు 15 వరకు వర్షాలు పడకుంటే బొబ్బెర్లు, ఉలవలు, గడ్డిజొన్నలు, కూరగాయలు సాగు చేయాలంటూ రైతులకు చెప్పుకొస్తున్నారు.

> రైతులు వానాకాలం పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పంట ప్రణాళికను సిద్ధం చేసి అందుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగింది. సూర్యాపేట జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 6.20.084 లక్షల ఎకరాలలో పంట సాగు కానున్నట్లు వెల్లడించారు. దీనిని పరిశీలిస్తే గత ఏడాదికన్నా 3 వేల ఎకరాలలో పంటసాగు అధికంగా అవుతున్నట్లు అంచనా వేశారు.

# 17న నల్లగొండ జిల్లాకు సిఎం

### కనగల్‌లో పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్):** ఈనెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో గురువారం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి కనగల్ సమీపంలో ఏర్పాట్లను పరిశీలించారు. కనగల్ వద్ద సుమారు రూ.14,500 కోట్లతో హ్యాండ్రింగ్ రోడ్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా, అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనల నేపథ్యంలో సీఎం రాక ఏర్పాట్లపై,బహిరంగ సభ నిర్వహణ ఏర్పాట్లు, హ్యాండ్రింగ్ రోడ్ల పైలాన్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించారు.ముందుగా కనగల్ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల సమీపంలో వెనుకవైపు ఉన్న స్థలాన్ని బహిరంగ సభ కోసం పరిశీలించారు.అంతేకాక గోదాం పక్కన దేవరకొండ రోడ్డు వద్ద హ్యాండ్రింగ్ రోడ్ పైలాన్ ఏర్పాటుకు పరిశీలించారు. దీంతోపాటు బహిరంగ సభ స్థలం, వాహనాల పార్కింగ్ స్థలం, హెలిప్యాడ్ స్థలాలను పరిశీలించారు. చెట్ల చెన్నారం వద్ద హెలిప్యాడ్‌కు, ధర్వేశిపురం వద్ద కూడా హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాలను పరిశీలించారు.ధర్వేశిపురం రేణుక ఎల్లమ్మ తల్లి దర్శనం, బహిరంగ సభ,హ్యాండ్రింగ్ రోడ్ల పైలాన్,హెలిప్యాడ్ స్థలాలపై రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన తర్వాత బహిరంగ సభ నిర్వహించే ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఆర్ అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్ రెడ్డి,డీఈ గణేష్ పాల్గొన్నారు.



**ఫోన్ చోరీ.. మనీ యాప్‌తో నగదు స్వాహా!**

### రూ.2లక్షల 70వేల నగదు, 27 స్మార్ట్ ఫోన్లు, ఒక కారును స్వాధీనం

### వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్‌పి కె. నరసింహ్మా



వివరాలు మెయిన్‌లో

# డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రాణాలకు భద్రత

### తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిష్ట్



వివరాలు మెయిన్‌లో

## ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఇంటర్ సప్లీమెంటరీ, ఇంప్రూవ్ మెంట్ ఫలితాల్లో నల్లగొండ రామగిరి లో గల ఎస్ ఆర్ కాలేజ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారని జోనల్ ఇంచార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఇద్దరు విద్యార్థులు 468 మార్కులు సాధించగా, ఏడుగురు 467మార్కులతో సత్తా చాటారని పేర్కొన్నారు. అదే విధంగా ముగ్గురికి 465 మార్కులు వచ్చాయి. బైపీసి విభాగంలో ఒకరికి 438 మార్కులు రాగ, ఇంకోరికి 327,మరో ఇద్దరికీ 436 మార్కులు వచ్చాయని తెలిపారు.అనంతరం ఇంప్రూవ్మెంట్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎస్. ఆర్ విద్యా సంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, డైరెక్టర్ సంతోష్ రెడ్డి, సీఈఓ సురేందర్ రెడ్డి, , అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ మనోజ్ రెడ్డి ఇతర అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

## గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/కోదాడ:** విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హదసరాణి అన్నారు. గురువారం పట్టణంలోని కెఆర్ఆర్ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి అదే కళాశాలలో ఎకనామిక్స్ అధ్యాపకులుగా పనిచేస్తున్న కేలోతు సైదులు పదివేల రూపాయల విలువగల పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను కొనుగోలు చేసి బహుకరించారు. పేద, మద్య తరగతి విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చందా అప్పారావు, సైదిరెడ్డి, మాతంగి యాకుబ్, నిర్మలకుమారి, మహ్మద్ రఫీ, రాజు, కేశవర్ధన్, యాదమ్మ, రమా పాల్గొన్నారు.

## యాదమ్మ మృతికి సంతాపం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** సీపీఎం భువనగిరి మండల కార్యదర్శి, చీమలకొండూరు గ్రామ సర్పంచ్ పల్లెర్ల అంజయ్య అమ్మ పల్లెర్ల యాదమ్మ అకాల మృతికి సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ తరఫున సంతాపాన్ని ప్రకటిస్తుమని సీపీఎం జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ తెలిపారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని చీమలకొండూరు గ్రామంలో మృతి చెందిన పల్లెర్ల యాదమ్మ పార్థివ దేహానికి జిల్లా, గ్రామ నాయకత్వంతో కలిసి జహంగీర్ పూలమాలలు ఘనమైన నివాళులు అర్పించి అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, సీపీఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, బి.ఆర్.ఎస్ భువనగిరి మండల అధ్యక్షులు, తోక్కాపురం గ్రామ సర్పంచ్ జనగాం పాండు తదితరులు పాల్గొన్నారు.



## అండర్ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సూర్యాపేట పట్టణంలో గత 8 నెలల నుంచి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, వెంటనే ఆ పనులను పూర్తి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ ఆఫీసులో మున్సిపల్ కమీషనర్‌కి సూర్యాపేట మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ గోతులు తీస్తున్నారో వెంటనే ఆ గోతులను పూడ్చకపోవడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనేకమార్లు కిందపడి కాళ్లు చేతులు విరగొట్టుకున్న సందర్భాలు ఉన్నాయని అన్నారు. వర్షాకాలం ప్రారంభమవుతుంది వర్షాలు పడుతున్నాయి రోడ్లన్నీ బురదగా ఉండటంతో మరో రెండు రోజుల్లో స్కూళ్లు ఓపెన్ అవుతున్నాయి పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే క్రమంలో గోతుల ద్వారా ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. అలాగే అన్ని వార్డుల్లో మురికి కాలువలోకి దోమల మందు కొట్టించి దోమలు రాకుండా ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు సిపిఐ కార్యవర్గ సభ్యులు దంతాల రాంబాబు, ఖమ్మంపాటి రాము, ఖమ్మంపాటి లక్ష్మి, పుత్తూరు లావణ్య, చిమిట ఈశ్వరమ్మ, సాయి పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఎస్ విద్యాసంస్థలు సేవలు అభినందనీయం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంతో పాటు పరిసరప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఎన్ఆర్ఎస్ విద్యాసంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నంబాబు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని విద్యానగర్‌లో ఎన్ఆర్ఎస్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఎస్ స్కూల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందించి వారిని బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దేలా ఎన్ఆర్ఎస్ యాజమాన్యం, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. టిపిసిసి డెలిగెట్ చింతకుంట్ల లక్ష్మి నారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ జాతీయస్థాయిలో ర్యాంకులు సాధించిన ఎన్ఆర్ఎస్ కళాశాల, ప్రాథమిక హైస్కూల్ విద్యతో కూడా అవే ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బరావు, తోట శ్రీను, కంభంపాటి శ్రీనివాస్, విద్యాసంస్థల చైర్మన్ వడ్డే రాజేష్‌చౌదరి, అడ్వైజర్ చైర్మన్ రవిశంకర్‌రెడ్డి, డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ గంధం వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ పిఎన్ఆర్, ఉపాధ్యాయులు నటరాజ్, ఉపేందర్, రజనికుమార్, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

## మల్లయ్యయాదవ్‌పై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదు



**ప్రజాపక్షం/కోదాడ:** నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాలుగా అన్ని ప్రభుత్వ శాఖలలో అవినీతి జరుగుతుంటే నిలువరించలేక ప్రశ్నించిన తమ నేత బొల్లం మల్లయ్యయాదవ్‌పై అవాకులు, చవాకులు పేలితే సహించేదిలేదని బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎస్‌కె నయీం అన్నారు. గురువారం కోదాడలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో యదేచ్చగా అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, అక్రమ ఇసుక రవాణా చేస్తుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోకుండా తమ నాయకుడిని విమర్శించడం ఏమిటని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో యాదవ్‌నగర్‌లో బహిరంగంగా మున్సిపాలిటి స్థలంలో ఓ కాంగ్రెస్ నాయకుడి బారీ డబ్బా కొట్టు ఏర్పాటు చేస్తే తొలగించాలని తాము మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని, ఐనా ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటి సామాగ్రిని అద్దె భవనాన్ని మార్చేందుకు 25 లక్షలు కమిషనర్ బిల్లు పెడితే ఏం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంపెట ఉపేందర్‌గౌడ్, కృష్ణయ్య, కరీం, లింగయ్య, చలిగంటి వెంకట్, గొర్రె రాజేష్, కిరణ్‌రెడ్డి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

## 16వ వార్డులో పడకేసిన పారిశుధ్యం



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో పారిశుద్య నిర్వహణ పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా గ్రామసభలను నిర్వహిస్తూ అభివృద్ధిపై దృష్టి సారిస్తుండగా ఈ వార్డులో మాత్రం మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. వార్డులోని డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోవడంతో మురుగు నీరు సక్రమంగా ప్రవహించకగా దుర్వాసన వెదజల్లుతుందని, వీధులన్ని చెత్తమయంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్యలపై పలుమార్లు వార్డు అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. పారిశుద్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోమలు, ఈగలు విఫరీతంగా పెరిగిప్రజల ఆనారోగ్యాల బారీన పడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీల శుభ్రతపై స్థానిక కౌన్సిలర్ కూడా తగిన శ్రద్ధ చూపడంలేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి వార్డులో పారిశుద్య పరిస్థితులను మెరుగుపర్చడంతో పాటు డ్రైనేజీలను శుభ్రం చేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని 16వ వార్డు ప్రజలు కోరుతున్నారు.

## నాణ్యమైన పౌర సేవలందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నల్లగొండ నగరాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించాలనే లక్ష్యంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర ఆదేశించారు. గురువారం నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన శాఖల వారీ సమీక్ష సమావేశంలో కమిషనర్ వివిధ అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, అభివృద్ధి పనులు, ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సులు, టౌన్ ప్లానింగ్, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, వర్షాకాల సన్నద్ధత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పి. వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అశోక్ కుమార్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు వి. దిలీప్, టి. ప్రవీణ్, టౌన్ ప్లానింగ్ అధికారి జె. సుకన్య,శానిటరీ సూపర్వైజర్ జి.శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, వార్డ్ అధికారులు, శానిటేషన్ జవాన్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు మరియు ఇతర సిబ్బంది ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ డిప్యూటీ కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ముఖ్యంగా పేద , మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలపైనే ఆధారపడుతున్నందున ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేసి వైద్య సేవలను మెరుగుపరచాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్, సీపీఎం మండల కమిటీ సభ్యులు వల్లంభట్ల శ్రీనివాసరావు, విద్యార్థి జనసామితి జిల్లా అధ్యక్షులు డప్పు గోపి, బీఆర్ఎస్ మండల నాయకులు చిప్పలపల్లి నరేందర్ పాల్గొన్నారు.

## ఎస్‌వి మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో ప్రతిభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఎస్‌వీ మోడల్ హై స్కూల్ పూర్వ విద్యార్థిని గోరుంట్ల పావని ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్మెంట్ పరీక్షల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి, 470 మార్కులకు గాను 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకు పొందింది. విద్యార్థిని పావనిసాధించిన ఈ ఘన విజయం పాఠశాలకు, తల్లి దండ్రులకు మరియు ఉపాధ్యాయులకు గర్వకారణమని పాఠశాల కరస్పాండెంట్ ఓరుగంటి శ్యామ్‌సుందర్ తెలిపారు. విద్యార్థిని కృషి, పట్టుదల, ఉపాధ్యాయుల సమర్థమైన మార్గదర్శకత్వం, తల్లి దండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ అద్భుత విజయాన్ని సాధించగలిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినికి హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ విజయం ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు.

## వెంటనే పరిష్కారం చేయాలి



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** తహశీల్దార్ కార్యాలయంలో వెంకారెడ్డి అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసినారు. భూ భారతి దరఖాస్తులు, మీ సేవ సర్టిఫికెట్‌లు, సాదా బైనామా దరఖాస్తు లు త్వరగా పరిష్కారం చేయాలని సూచించిన్నారు.



## జయశంకర్ వర్ధంతి సభ జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఈనెల 21న తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని బీసీ హక్కు సాధన సమితి శ్రేణులకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. గురువారం మిర్యాలగూడలో బీసీ నేతలతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతూ జూన్ 21న అమరవీరుల దినోత్సవం గా బీసీ శ్రేణులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు యువజన మేధావులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించాలని ఆయన కోరారు. సమావేశంలో తమ్మళ్ల వంశీ, పరికె భరత్ ఉన్నారు.

## చిన్నారులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండలంలోని ఎస్‌డబ్ల్యూ లింగోటం శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో బుధవారం నూనె మల్లయ్య, పద్మ దంపతుల కుమారుడు శ్రీరామ్, కుమార్తెలు రక్షిత, దీక్షితల నూతన పట్టు వస్త్ర లంకరణ మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,బచ్చనవోని కృష్ణ యాదవ్, నూనె వెంకటయ్య, గోపు వెంకటయ్య గౌడ్, మారగోని శంకర్, వెంకన్న పాల్గొన్నారు.

## మహంకాళి దేవస్థాన నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలో శ్రీశ్రీ మాంకాళి దేవస్థానం నిర్మాణ పనులకు గురువారం స్థానిక సర్పంచ్ గద్వాల ఉపేంద్ర భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వేద మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలన్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## నాయబ్ తహసీల్దార్‌గా జానయ్య

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** స్థానిక రెవిన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న దాసరి జానయ్య కు సీనియర్ అసిస్టెంట్ హోదా నుండి నాయబ్ తహసిల్దార్‌గా పదోన్నతి లభించింది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయనకు ఈ పదోన్నతి కల్పించగా సహచర ఉద్యోగులు మరియు రెవిన్యూ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జానయ్య కార్యాలయ పనులు వ్యవహరించడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపారని అధికారులు పేర్కొన్నారు.

# నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం ఆయన కొండమల్లేపల్లి మండల వ్యాప్తంగా వివిధ అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కొండమల్లేపల్లిలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు ఏర్పాటు చేసిన రెండు కొత్త చెత్త ఆటోలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రూ. 30లక్షలతో నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వల భవనానికి శంకుస్థాపన చేశారు. రూ. 40లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్లాస్టిక్ వెస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ నిర్మాణ పనులకు కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల పరిధిలోని దంజిలాల్ తండాలో నూతన బోరు, సిసి రోడ్లను ప్రారంభించారు. ఇందిరమ్మ ఇళ్ళు లబ్ధిదారులయిన రమావత్ మౌనిక శ్రీకాంత్ గృహ ప్రవేశంలో పాల్గొని రిబ్బన్ కట్ చేశారు. గన్యనాయక్ తండాలో మూడు ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలలో పాల్గొన్నారు. దంజిలాల్‌తండా సమస్యలయిన ఇందిరమ్మ ఇండ్లు, విద్యుత్ సమస్య తదితర అంశాలను శ్రద్ధగా విని నోట్ చేసుకొని అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మేకల శ్రీనివాస్‌యాదవ్, మాజీ వైస్ ఎంపిపి కాసర్ల వెంకటేశ్వర్లు, నాయిని మాధవరెడ్డి, మండల అధ్యక్షుడు ఊట్కూరి వేమన్‌రెడ్డి, సర్పంచ్‌లు పసునూరి యుగేందర్‌రెడ్డి, రమావత్ రామునాయక్, గోజీ పాల్గొన్నారు.

# ఎరువులు, విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గంలో ఎరువులు, విత్తనాలు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. వర్షాకాలం పంటల ప్రణాళిక, యూరియా నిల్వలపై సమీక్షలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో రానున్న వర్షాకాలం (ఖరీఫ్) సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక, రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల సరఫరాపై ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు, (పీఏసీఎస్) సీఈఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఇతర ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో సాగు విస్తీర్ణం, పంటల ఎంపిక, విత్తనాలు, ఎరువుల అవసరాలపై అధికారులు వివరాలు అందించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.జగదీశ్వర్ రెడ్డి, మిర్యాలగూడ, వేములపల్లి, దామరచర్ల, అడవిదేవులపల్లి, మాడ్గులపల్లి మండలాల వ్యవసాయ అధికారులు ఎం. ఋష్యేంద్రమణి, జి.సరిత, శివరాం, కిషోర్, బాలకృష్ణ, ఎస్ఎ, ఎంఇఓలు శ్రీకాంత్, ఎండి.షఫీ, రమేష్, నాగయ్య, వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ సీఈఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య చరిత్రలో మైలురాయి 'ఐకాన్' హాస్పిటల్..



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** అత్యాధునిక న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన ఐకాన్ హాస్పిటల్ మరో అరుదైన మైలురాయిని చేరుకుని ఇప్పటివరకు 100 బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించివైద్య చరిత్రలో మైలురాయిగా నిలిచిందని డాక్టర్ శశాంక కోడే పేర్కొన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని ఐకాన్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దామచర్ల గ్రామానికి చెందిన దారం రమణ గత కొన్ని సంవత్సరాలుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ పలు ఆసుపత్రుల చుట్టూ తిరిగి దాదాపు 3 లక్షలు ఖర్చు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు.దీంతో వారు ఐకాన్ ఆస్పత్రికి రావడంతోసాంకేతికత. ఆధునిక ఆపరేషన్ థియేటర్లు,అత్యాధునిక పరికరాలు అనుభవజ్ఞులైన ప్రొఫసర్ రాజేష్, డాక్టర్ శశాంక కోడె, డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ సాయి లావణ్య కడిమి నేతృత్వంలోని న్యూరో సర్జరీక్రిటికల్ కేర్ బృందంతో బ్రెయిన్ ట్యూమర్ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించి, చికిత్స అనంతరం రోగిని ఆరోగ్యంగా డిశ్చార్జ్ చేయడం జరిగిందని తెలిపారు.పెద్ద నగరాల్లో లభించే చికిత్సను ప్రజలకు వారి సొంత జిల్లాలోనే అందించాలనే ప్రయత్నమే ఈ విజయానికి కారణం. అన్నారు.మా లక్ష్యం కేవలం శస్త్రచికిత్సలు చేయడం కాదు, గ్రామీణ పట్టణ ప్రజల మధ్య ఉన్న వైద్య అసమానతను తగ్గించడమే అన్నారు.పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన అత్యాధునిక వైద్యం ఇప్పుడు నల్లగొండ ప్రజలకు వారి ఇంటి వద్దే అందుబాటులో ఉందని ఇదే ఐకాన్ హాస్పిటల్ సంకల్పం అన్నారు.

## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట ఎరువులు



**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం డిండి, తవకలాపూర్ లలో పచ్చిరొట్ట ఎరవులయిన జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రెహానా తెలిపారు. జనుము 40కేజీల బస్తా మొత్తం ధర రూ. 6220 కాగా 50శాతం సబ్సిడితో రైతుకు రూ. 3110లు చెల్లించి పొందవచ్చని అన్నారు. జీలుగు 30 కేజీల బస్తా మొత్తం ధర రూ. 4905 కాగా 50శాతం సబ్సిడితో రైతుకు రూ. 2452.50లు చెల్లించి పొందవచ్చని తెలిపారు. రెండు ఎకరాల భూమికి సుమారు 30కేజీల జీలుగు కానీ 30 కేజీల జనుము విత్తనం అవసరం అవుతుందని పచ్చిరొట్ట విత్తనాలు పొలంలో వేసుకోవడంతో భూమి బలంతో పాటు పంటకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఆమె వెంట సిఈవో వంగాల బాల్‌రెడ్డి ఉన్నారు.



## అంగరంగ వైభవంగా శ్రీ వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను భక్తిశ్రద్ధలతో విశేషంగా నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో ఈరోజు ఏకాదశిని పురస్కరించుకొని శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు నవ కలుశ పంచామృత అభిషేకాన్ని నిర్వహించారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు సుగంధ భరితమైన పుష్పమాలలను పట్టు పితంబరములను మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య తీసుకోని వచ్చి శ్రీ స్వామి వారికి తోమాల సేవ, మేల్ చాట్ వస్త్ర సేవలో పట్టు వస్త్రములు సమర్పించడం జరిగింది. తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోనే గుర్తింపు



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** విద్యుత్ కార్మికులు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతోనే గుర్తింపు వస్తుందని సూర్యాపేట డివిజనల్ విద్యుత్ డిఇ ఎన్. వెంకట కృష్ణయ్య అన్నారు. గురువారం స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో హుజూర్‌నగర్ డివిజన్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో శ్రమశక్తి అవార్డును పొందిన నాదెండ్ల బాలకృష్ణకి ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. బాలకృష్ణ ఉద్యోగరిత్యా పేద, మధ్య తరగతి ప్రజలకు ఇబ్బంది లేకుండా సేవలందించారన్నారు. సత్యమేవ జయతే సేవా సమితిని ఏర్పాటు చేసి ఎంతోమందికి ఆశరాగా నిలిచారని గుర్తు చేశారు. విద్యుత్ కార్మికులకు సమస్యలు వచ్చినప్పుడు సానుకూలంగా పరిష్కరించారన్నారు. ప్రతి విద్యుత్ కార్మికుడు బాలకృష్ణ లాగా ప్రజలకు విద్యుత్ సమస్యను తొందరగా తీర్చి విద్యుత్ శాఖకు గుర్తింపు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ కార్యనిర్వాహక అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు నేతగాని వెంకన్న, కార్యదర్శి పి. యాదగిరి నాయుడు, నాయకులు కల్వల సత్యనారాయణ, జాస్తి సుబ్బారావు, ఏ. రామారావు, జానకిరామయ్య, భాస్కర్, మధుసూదన్ రావు పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్, ఈగల్ బృందాల ఆకస్మిక తనిఖీలు



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలో గురువారం పాన్ షాపులు,కిరాణా దుకాణాలు,బస్టాండ్ సెంటర్‌లో డాగ్ స్క్వాడ్, ఈగల్ బృందాలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. పై అధికారుల ఆదేశాల మేరకు నల్లగొండ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాల నిల్వలు, విక్రయాలపై క్షుణ్ణంగా పరిశీలన చేపట్టింది. అనుమానిత ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేసి, దుకాణదారులకు కఠిన హెచ్చరికలు జారీ చేశారు.మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం మోపుతామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి అక్రమ విక్రయాల సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు.ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ప్రదీప్, సిబ్బంది అనిల్, సందీప్ పాల్గొన్నారు.



## తుర్కపల్లి రామాలయంలో ఘనంగా సంకీర్తన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తుర్కపల్లి గ్రామంలోని శ్రీ రామాలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కలిసి 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే... హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే...'అంటూ భజనలు చేస్తూ ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. సంకీర్తనలో పాల్గొన్న భక్తులు శ్రీరాముని నామస్మరణ చేస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు కందుకూరి అమర్నాథ్,మడిగె వెంకటస్వామి,ఆకుల సిద్ధులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ మృతి బిఆర్ఎస్‌కు తీరనిలోటు



**ప్రజాపక్షం/చింతపల్లి :** మండల పరిధిలోని అనాజిపురం గ్రామానికి చెందిన బుషిపాక శ్రీకాంత్ మృతి బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం అనాజిపురం గ్రామంలో శ్రీకాంత్ మృతదేహానికి రవీంద్ర కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడు కుటుంబానికి తన ప్రగాఢసానుభూతిని తెలిపి పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీకాంత్ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ నాయకులు ఎండి ఖాలేదు తండ్రి గాలిఫ్ అనారోగ్యానికి గురి కావడంతో ఆయనను రవీంద్ర కుమార్ పరామర్శించారు. నల్లమాద కాంతిరెడ్డి కుమారుడు నల్లమాద కర్ణాకర్‌రెడ్డి మృతుడి కుటుంబానికి పదివేల రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, అనాజిపురం గ్రామ సర్పంచ్ ముదిగొండ అనిత మొగులయ్య, రమావత్ కొండల్‌నాయక్, ఎండి ఖాలేదు, నరసింహా పాల్గొన్నారు.

## వెంకటేశ్వర అలివేలు మంగమ్మ కల్యాణంలో జాలే నర్సింహారెడ్డి

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో గురువారం శ్రీశ్రీ వెంకటేశ్వర అలివేలుమంగమ్మ కళ్యాణ మహోత్సవంలో పిఎసిఎస్ చైర్మన్ జాలే నర్సింహారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి జాలే ప్రేమలతరెడ్డి, సర్పంచ్ చిరంజీవి యాదయ్య, వెంకటయ్య, అంకులయ్య, వెంకటాచారి, వీరయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసి పట్టండి

**జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపు**



**ప్రజాపక్షం/నల్లగొండ :** ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ వర్షం ద్వారా కురిసిన నీటిని వడిసిపట్టాలని, అంతేకాక ఇంటింటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జల శక్తి అభియాన్ కింద జల్ సంచాయ్, జన్ భాగీదారి ప్రచార కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎన్ జి కళాశాల మైదానం నుండి నిర్వహించిన బైక్ ర్యాలీని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్ నినో వల్ల ఈ సంవత్సరం వర్షాలు నిరంతరం కురిసే అవకాశం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారని, అవసరం ఉన్నప్పుడు వర్షం రాకపోవడం, అవసరం లేనప్పుడు రావడం వంటి పరిస్థితులు నెలకొంటాయని , దీనిని దృష్టిలో ఉంచుకొని వర్షం కురిసినప్పుడు వాన నీటిని వడిసిపటాల్సిన అవసరం ఉందని అన్నారు.అలాగే ఇంటింటికి ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ లు కూడా నిర్మించుకోవాలని తెలిపారు.మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని వాన నీటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడి పై ఉందని అన్నారు.జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డిపిఒ శంకర్ నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యారంగాన్ని వ్యాపారంగా మార్చొద్దు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రైవేట్ విద్యాసంస్థలు కేవలం లాభార్జనే ధ్యేయంగా కాకుండా సామాజిక సేవా దృక్పథంతో నిరుపేద, సామాన్య వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మిర్యాలగూడ పట్టణ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించిన మౌంట్ కార్మెల్ లిటిల్ కిడ్స్ పాఠశాల భవనాన్ని ఆయన తెలంగాణ శాసనమండలి సభ్యులు కేతావత్ శంకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని వ్యాపార కోణంలో చూడటం సరికాదని, అడ్డగోలు ఫీజుల వసూళ్లకు స్వస్తి పలికి సామాన్యుడి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఫీజులను నిర్ణయించాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు ఎక్కడా ఆస్కారం లేకుండా ప్రశాంతమైన వాతావరణంలో విశాలమైన స్థలంలో ఈ పాఠశాలను నిర్మించడం చాలా అభినందనీయమన్నారు. డీసీసీ సెక్రెటరీ చిలుకూరి బాలు మాట్లాడుతూ పర్యావరణ హితం కొరకు పాఠశాలల పరిధిలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు లీడ్ వాక్యాలను అన్వయిస్తూ సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖ నాయకులు గుడిపాటి నవీన్, 16వ వార్డు కౌన్సిలర్ జున్నపాల సునీత కిరణ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, మహేందర్ రెడ్డి అద్వకేట్, గూడూరు శ్రీనివాసరావు, మౌంట్ కార్మెల్ వ్యవస్థాపక కరెస్పాండెంట్ పీవీకే రామన్, లోటస్ స్కూల్ కరస్పాండెంట్ వరప్రసాద్, సాయి టెక్నో స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసచార్యులు, దాహిల్ కరస్పాండెంట్ సాయి శ్రీనివాస్, నవ జ్యోతి స్కూల్ ప్రిన్సిపాల్ చార్లెస్, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న సర్పంచ్‌ను సస్పెండ్ చేయాలి



**ప్రజాపక్షం/గుండాల;** అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న నూనెగూడెం సర్పంచ్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని గురువారం గ్రామ వార్డు సభ్యులు మద్దెపురం రాజు, తూనం సతీష్‌లు డిమాండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ భర్త మద్దెపురం పరశురాములు చట్టబద్ధమైన అధికారాలు లేకపోయినా పంచాయతీ వ్యవహారాల్లో అనధికారికంగా జోక్యం చేసుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. జూన్ 06న జరిగిన గ్రామ సభలో వీధిలైట్లు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక, నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం తదితర అంశాలపై ప్రశ్నించినందుకు వార్డు సభ్యులను సభలో బూతులు తిట్టి అవమానించడమే కాకుండా బెదిరింపులకు గురిచేశాడని అన్నారు. 2026 ఫిబ్రవరి నెలలో ఊరకుంట కట్టను రెండు చోట్ల తొలగించి చదును చేశారని, పాలకవర్గ సమావేశాల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించి జోక్యం చేసుకొని వార్డు సభ్యుల హక్కులకు భంగం కలిగిస్తున్నారని అన్నారు. గ్రామ పంచాయతీ నిర్ణయాలు, అభివృద్ధి పనులు, ఇతర పరిపాలనా అంశాలలో సర్పంచ్ స్థానంలో వ్యవహరిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. సర్పంచ్ తన విధులను స్వయంగా నిర్వహించకుండా తన భర్తకు అనధికారికంగా బాధ్యతలు అప్పగించడం వల్ల పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం దెబ్బతింటుందన్నారు. ఈ చర్యలు స్థానిక సంస్థల చట్టాల ఉల్లంఘనగా భావిస్తున్నామని ఈ విషయంపై సమగ్ర విచారణ జరిగిపి గ్రామ సర్పంచ్‌ను సస్పెండ్ చేసి పరశురాములుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యులు కోరారు.



## దళిత క్రైస్తవుల అవగాహన సదస్సును విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఈనెల 13న నల్లగొండలో నిర్వహించే దళిత క్రైస్తవుల అవగాహన సదస్సును విజయవంతం చేయాలని ఏఐసిఎఫ్ ఉమ్మడి నల్లగొండ కోఆర్డినేటర్ పి.డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలో గల సెల్స్ బాప్టిస్ట్ చర్చ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలని 1950 ప్రె సిడెన్షియల్ ఆర్డర్ ను తొలగించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలోని లక్ష్మీ గార్డెన్లో నిర్వహించే అవగాహన సదస్సుకు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, అదేవిధంగా ఏఐసిఎఫ్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు తో పాటు క్రైస్తవ నాయకులు, పలువురు వక్తలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సెల్స్ బాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ క్రిస్టఫర్, ఆర్‌సిఎం చర్చి ఫాదర్ జీవన్,బిషప్ సమర్పన్ కుమార్,హెబ్రోన్ సేవకులు జాకోబు రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చిట్యాల పాల్ రాజ్ ,హెడ్ మాస్టర్ ప్రభు దాస్, డి. ప్రేమ్ కుమార్,మేడి లక్ష్మయ్య,శౌరయ్య, యాచారం యాకోబ్, చింత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకు కూలిన చెట్లు

**పోలీసుల చొరవతో ట్రాఫిక్ పునరుద్ధరణ**

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** మండలంలో గురువారం సాయంత్రం చెర్వుగట్టు ప్రధాన రహదారిపై ఒక్కసారిగా భారీ ఈదురు గాలులు వీచాయి.దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పలు చెట్లు కూలి రహదారిపై అడ్డంగా పడిపోయాయి.పెద్ద పెద్ద కొమ్మలు రోడ్డు మొత్తం ఆక్రమించడంతో వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ విష్ణు వెంటనే నార్కట్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సహాయంతో రోడ్డుపై పడిన చెట్ల కొమ్మలను తొలగించారు. దాదాపు 30 నిమిషాల పాటు శ్రమించి రహదారిని పూర్తిగా క్లియర్ చేసి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.పోలీసుల సత్వర స్పందన వల్ల ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. పోలీసుల చొరవను ప్రయాణికులు, స్థానికులు అభినందించారు.

## ఎండల ప్రభావమా..?

**రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం**



**ప్రజాపక్షం/నందికొండ:** నాగార్జునసాగర్ సమీపంలోని జాతీయ రహదారి 565పైన గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమవడం కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం, విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెల్లికల్ క్రాస్ రోడ్ దాటి దయ్యాలగండి సమీపంలో సాయంత్రం 5.30 గంటల సమయంలో 55 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ఓ వ్యక్తి మృతదేహం రహదారి పక్కన కనిపించింది. మృతుడు భిక్షాటన చేసుకునే వ్యక్తిగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి దుస్తులు మురికిగా ఉండటంతో పాటు, అతను కొంతకాలంగా సరైన ఆహారం తీసుకోకపోవడం, ఇటీవల నెలకొన్న తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బ తగిలి మృతి చెందిన ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడికానున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ కమలా నెహ్రూ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియపోవడంతో పోలీసులు గుర్తింపు కోసం చర్యలు చేపట్టారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 'గో టూ విలేజ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మందకృష్ణ మాదిగ సాధించిన ఎస్‌సి వర్గీకరణ ఫలితాలు ప్రతి జాతి బిడ్డకు అందడమే లక్ష్యంగా గో టు విలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ మండల కోఇంచార్జి మొండికత్తి మనోజ్ మాదిగ, మండల అధ్యక్షుడు కొండేటి గోపి మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నియోజక వర్గ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. వర్గీకరణ ఫలాలపై గ్రామాల్లోని విద్యార్థులు, నిరుద్యోగులను చైతన్యపరచాలన్నారు. మే 25 నుండి జూలై 5 వరకు జరిగే 40 రోజుల గో టు విలేజ్ ప్రచారంలో జాతిని సంఘటితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలపట్ల



చందు, మామిడి సందీప్, బచ్చలకూరి గోపి, పల్లెపంగ పందు, నెమ్మాది రాకేష్ పాల్గొన్నారు.



# ఇంటి ముంగిట్లోనే పాఠశాల అడ్మిషన్లు

**ప్రజాపక్షం/నకిరేకల్ :** ప్రొఫసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా చందంపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థుల చేరికల కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. పాఠశాలలు ఈ నెల 15న పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థుల ఇళ్ల వద్ద, తల్లిదండ్రుల పని ప్రదేశాల్లోనే అడ్మిషన్లు నమోదు చేశారు.అలాగే ఉపాధి హామీ పనులు జరుగుతున్న చెరువు కట్టపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కనుకుంట్ల నవీన్‌రెడ్డి, ఉపాధ్యాయులు వేదాంతం ఆదిత్య భూపతి,అనిత,అమరలింగాచారి, నాగలక్ష్మి,ఎల్లయ్య,నరసింహ,పద్మ, మానస, కార్తీక్ పాల్గొన్నారు.

# రూ.32 లక్షలతో మర్రూర్ చెరువు పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/నకిరేకల్:** నకిరేకల్ మండలం మర్రూర్ గ్రామంలో రూ.32 లక్షల వ్యయంతో చేపట్టనున్న చెరువు మరమ్మతు నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వనరుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చెరువు మరమ్మతు పనులు పూర్తయితే రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడి వ్యవసాయానికి మేలు జరుగుతుందని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాభివృద్ధితో పాటు రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో ఏసుపాదం,నరెందర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

## నేర నియంత్రణలో నిర్లక్ష్యానికి తావులేదు
## జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో నమోదవుతున్న వివిధ నేరాలపై సమగ్ర సమీక్ష నిర్వహిస్తూ, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవర్ అధికారులను ఆదేశించారు. గురువారం నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన క్రైమ్ రివ్యూ సమావేశానికి డిఎస్‌పిలు, సీఐలు,ఎస్‌ఐలు వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో నమోదైన గ్రేవ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ప్రతి కేసులో నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు, జరిగిన ప్రతి దొంగతనం కేసులో ప్రాపర్టీ డిటెక్షన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.దొంగతనాల నియంత్రణలో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నేర ప్రబల ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, రాత్రి పహారా విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. సీసీ కెమెరాలు నేరస్తులను గుర్తించడంలో, కేసుల ఛేదనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.పోలీస్ అధికారులు ప్రతి కేసులో'క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌పాటించాలని, శాస్త్రీయ ఆధారాలు, సాంకేతిక సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజీలు, డిజిటల్ డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యం, ఆలస్యం లేకుండా చట్టపరమైన నిబంధనల ప్రకారం సమయానికి చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు.సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్ ద్వారా సమాచారాన్ని అందించాలని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, నల్లగొండ డిఎస్‌పిలు శివరాం రెడ్డి, రాజశేఖర రాజు,శ్రీనివాసరావు, సైబర్ క్రైమ్ లక్ష్మీనారాయణ,సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణకు ఘన నివాళులు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ జర్నలిస్ట్ దోసపాటి సత్యనారాయణ గురువారం తెల్లవారుజామున అనారోగ్యంతో తుది శ్వాస విడిచారు.ఆయన మరణవార్త జర్నలిస్టు లోకాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది.ప్రస్తుతం సూర్య దినపత్రికలో ఉమ్మడి జిల్లా బ్యూరోగా విధులు నిర్వహిస్తున్న దోసపాటి సత్యనారాయణ గతంలో విశాలాంధ్ర ,ఆంధ్రప్రభ,మన తెలంగాణ, తదితర దినపత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేసి జర్నలిజం రంగానికి విశేష సేవలందించారు.ఆయన అకాల మరణానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య,టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి పులిమామిడి మహేందర్ రెడ్డి,తదితర జర్నలిస్టు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిజం రంగంలో ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయన మరణం పాత్రికేయ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు.

# 13న సాహిత్య సదస్సును జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రముఖ సాహితీవేత్త మేరెడ్డి యాదగిరి రెడ్డి యాభై ఏళ్ల సాహిత్య జీవితాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సమాలోచన సదస్సును విజయవంతం చేయాలని సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ల ఆనంద్ కోరారు.ఈ మేరకు నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల13న సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను పట్టణానికి చెందిన కవులు ఆవిష్కరించారు. ప్రారంభ సభకు తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి, ముగింపు సభకు భాషా సాంృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కవులు,రచయితలు, కళాకారులు, సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమా న్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.



# నాణ్యమైన విద్యపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ జిల్లా కేంద్రంలోని కోమటి రెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యను అందించడంపైనే ఉపాధ్యాయులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.గురువారం ఆయన బొట్టుగూడలోని కోమటిరెడ్డి ప్రతీక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి తరగతి గదులు, పరిసరాలు, డైనింగ్ హాల్, లైబ్రరీ, క్రీడా పరికరాలు తదితరాలను పరిశీలించారు.పాఠశాల ద్వారా గుణాత్మక విద్యతో పాటు పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని,టాయిలెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని,తరగతి గదులు, పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న దృష్ట్యా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేందుకు పాఠశాల పక్కనే ఉన్న స్థలంలో తాత్కాలికంగా కిచెన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే తరగతి గదుల్లో ఏసీలు వినియోగించేటప్పుడు గదులు మూసి ఉంచాలని, పాఠశాలలోని లైబ్రరీ, గేమ్స్, ఇతర అన్ని పరికరాలను విద్యార్థులు వినియోగించుకునేలా చూడడంతో పాటు వాటిని జాగ్రత్తగా సంరక్షించాలన్నారు. పాఠశాలలో పచ్చదనం ఉండేలా మొక్కలకు నిరంతరం నీరందించాలని, మొక్కలు ఎండిపోకుండా చూడాలని, పాఠశాల ఆవరణలోకి వాహనాలు రాకుండా చూడాలని ఆదేశించారు. నల్లగొండ ఎంఈఓ అరుంధతి, పాఠశాల హెడ్మాస్టర్ తదితరులు ఉన్నారు.

# ఉత్తమ ఫలితాలు సాధించిన కెఎల్‌ఎన్ విద్యార్థులు



**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ బికుమళ్ల కిరణ్‌కుమార్ తెలిపారు. జయిని చంద్రలేఖ, జీ. శ్రావణి, పీ. అంజనలు 468 మార్కులు సాధించగా, టీ. హన్సిక, జీ. అక్షిత, బీ. వాణి 467 మార్కులు సాధించడం హర్షనీయమన్నారు. కళాశాల విద్యార్థులు 24మంది 460కి పైగా మార్కులు సాధించడం గొప్ప విషయమన్నారు. డైరెక్టర్లు పిఎల్‌ఎన్ రెడ్డి, హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, చైతన్య పాల్గొన్నారు.

# మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలపై ప్రజలలో విస్తృత అవగాహన

## కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మ్యాజిక్ డ్రైన్ నిర్మాణాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురు వారం కలెక్టరేట్ విసి హాల్‌లో ఉపాధి హామీ పథకంపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేయూత పెన్షన్లో ఫేస్ అథెంటికేషన్ త్వరగా పూర్తి చేయాలని అర్హు లు, అనర్హుల జాబితా రిజిస్టర్లు తప్పక నిర్వహించాలని అన్నారు. ఎంపిడిఓ లాగిన్‌లో ఉన్న పెండింగ్‌లో ఉన్న వాటికి అప్రూవల్ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సంబంధించి అన్నిం టికి మరుగుదొడ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఇండ్లకు కూడా మరుగుదొడ్లు మంజూరు చేయా లని, గ్రామ పంచాయితీల దగ్గర ఉన్న వాటికి సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. రానున్న వర్షాల దృష్ట్యా డ్రైనేజ్, ఇంకుడు గుంతల పనులు పూర్తి చేసి వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీయించాలన్నారు. పండ్ల తోటలు, మునగల తోటలు పెంచు లబ్ధిదారులను గుర్తించి వారికి ఉపాధి హామీ కింద లబ్ధి చేకూరేలా చేయాలని ఉపాధి హామీ మెటిరియల్ ప్రభుత్వం నుండి విడుదలైన నిధులను పూర్తి అయిన పనులకు చెల్లింపులు చేసి నిధులు వినియోగించు కోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిపి పిడి సన్యాసయ్య, జడ్‌పి సిఇఓ శిరీష, డిపిఓ యాదగిరి, అడిషనల్ డిఆర్‌డిఓ చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

